సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 23 । జూన్ । 2023



టెక్ డ్రైవ్‌లో ఐదుగురి ఎంపిక

రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన హెచ్‌సీఎల్ టెక్ డ్రైవ్‌లో ఐదుగురు ఎంపికయ్యారు. 8లో



'సిరి'ధాన్యాలు 8లో

మన్యంలో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఏర్పడటంతో ఏజెన్సీ వారపు సంతల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి

పోటీ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. 8లో

న్యూస్‌రీల్

సత్వర పౌర సేవలందించడమే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: సత్వర పౌరసేవలను అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం అన్ని మండలాల తహసీల్దార్లు,, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాయాల పరిధిలో పర్యటించాలని ఆదేశించారు. ముందుగా షెడ్యూల్ తయారుచేసి వలంటీర్లకు, సచివాలయం ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, సమస్యలపై తెలుసుకుని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జారీచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సచివాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, డీఆర్వో అంబేడ్కర్ పాల్గొన్నారు.

బాంబ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అరకులోయ రూరల్: మండలంలో గురువారం విస్తృతంగా బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతోపాటు పద్మాపురం, యండపల్లివలస, రవ్వలగూడ, జెడ్పీ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డు, గన్నెల రోడ్డు తదితర ప్రాంతాల్లో తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సంతోష్ మాట్లాడుతూ అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ఆరు రోజుల పాటు బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరుగుతాయన్నారు. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. తనిఖీలో ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు శిశువు

- అప్పగించిన ఐసీడీఎస్ పీవో నీలిమ



శిశువును అప్పగిస్తున్న సీడీ పీవో నీలిమ

డుంబ్రిగుడ: అరకులోయ ఆస్పత్రిలో అపహరణకు గురైన శిశువు ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరింది. అపహరణకు గురైన శిశువు ఆస్పత్రిలోని వైద్యుల ఆధీనంలో ఉండటం తెలిసిందే. గురువారం ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ గ్రామపెద్దల సమక్షంలో దర్యాప్తు నిర్వహించారు.శిశువు రంగిలిసింగి గ్రామానికి చెందిన రామరాజు,గౌరి దంపతులకు పుట్టిన బిడ్డ అని నిర్ధారణ కావడంతో ఐసీడీఎస్ అధికారులు, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు శిశువును అప్పగించారు. గ్రామ పెద్దలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



ఎంపీటీసీ కిలో ఈశ్వరమ్మ తదితరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని రింతాడ -2 స్వతంత్ర ఎంపీటీసీ కిలో ఈశ్వరమ్మతోపాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 42 మంది ఆమె సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఒకే పార్టీ ఒకే సీఎం ఉంటారన్నారు. అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె పేర్కొన్నారు.

పసుపు రైతుకు ఊరట

జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పసుపు కొనుగోళ్లు ప్రారంభం కావడం గిరి రైతులకు ఊరటనిచ్చింది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధర తగ్గించిన నేపథ్యంలో గిట్టుబాటు ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యాపారులు కిలో రూ.45 నుంచి రూ.45 చెల్లిస్తుండగా మార్క్‌ఫెడ్ మాత్రం రూ.68.50 ధరకు కొనుగోలు ప్రారంభించింది.

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభం
- కిలోకు రూ.68.50 చెల్లింపు
- 178 టన్నుల కొనుగోలు లక్ష్యం
- వచ్చే నెల 15 వరకు సేకరణ



పసుపును గ్రేడింగ్ చేస్తున్న గిరిజన రైతులు



మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న పసుపు

సాక్షి,పాడేరు: మన్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న పసుపునకు ఎట్టకేలకు గిట్టుబాటు ధర లభించింది.ఏజెన్సీ చరిత్రలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ పసుపును కొనుగోలు చేస్తుండడం ఇదే ప్రథమం. ఈఏడాది మార్చి నుంచి గిరిజన రైతులు ఏజెన్సీ 11 మండలాల్లో పసుపు అమ్మకాలు ప్రారంభించారు. అయితే వ్యాపారులంతా సిండికేట్‌గా మారి పసుపు కొనుగోలు ధరలను భారీగా పతనం చేశారు.

కిలో రూ.40 నుంచి రూ.45 ధరతో పసుపును వ్యాపారులు కొనుగోలు చేయడంతో గిరిజన రైతులు నిరాశకు గురయ్యారు. కష్టపడి సాగు చేసిన పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజన రైతులు భారీగా నష్టపోయారు.కనీసం పెట్టుబడి, కూలి సొమ్ము కూడా రాని పరిస్థితితో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి సమస్య

ఏజెన్సీలో గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సుమారు 20 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నాణ్యమైన పసుపును పండిస్తున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో సమస్యను కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మైదాన ప్రాంతాల్లో పసుపు ట్రేడర్లతో సమావేశాలు నిర్వహించి, పసుపును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశించారు. మరోపక్క ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ సంస్థతో చర్చలు జరిపారు. కలెక్టర్ నివేదికతో ప్రభుత్వం స్పందించింది.మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కిలో రూ.68.50 చొప్పున కొనుగోలుకు ధర నిర్ణయించింది.

మూడు కేంద్రాల్లో..

ప్రభుత్వంతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ పసుపు కొనుగోలు ప్రారంభించింది. గిరిజన రైతుల వద్ద పసుపు నిల్వలు అధికంగా ఉన్న గూడెంకొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లో మూడు కేంద్రాల ద్వారా కిలో రూ.68.50 ధరతో గురువారం నుంచి కొనుగోలు చేపట్టింది. గ్రేడింగ్ పసుపును మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో గిరిజన రైతులంతా నాణ్యమైన పసుపునే విక్రయించాలని మార్క్‌ఫెడ్ సంస్థ జిల్లా అధికారి రమేష్ కోరారు. వచ్చే నెల 15 వరకు రైతుల నుంచి 178 టన్నులు కొనుగోలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గిట్టుబాటు ధర లక్ష్యం



గిరిజనులు సాగు చేసిన వ్యవసాయ, వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నాం. వారపుసంతలలో పసుపును వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి మోసాలకు పాల్పడడం సరికాదు. పసుపును గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ సంస్థకు నివేదించాం. ఏజెన్సీలోనే తొలిసారిగా మార్క్‌ఫెడ్ సంస్థ పసుపును కిలో రూ.68.50పైసలతో కొనుగోలు చేస్తుండడంతో పసుపు రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. – సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

ప్రభుత్వ నిర్ణయంతో మేలు



మార్క్‌ఫెడ్ ద్వారా పసుపును గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తుండడంతో పసుపు రైతులకు ఎంతో మేలు చేసింది. దళారులు, వ్యాపారులు కిలో రూ.45కు మించి కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. పసుపునకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – ఎస్.చినకొండబాబు, పసుపు రైతు, గడుతూరు, జి.మాడుగుల మండలం

అన్నదాతను రాజును చేసిన ప్రభుత్వం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ



ఇంజిన్లు, వ్యవసాయ పరికరాల పంపిణీలో ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: రైతును రాజుగా చేస్తున్న ప్రభుత్వం తమదేనని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఎం కృషి సంచయ్ యోజన పథకంలో భాగంగా వాటర్‌షెడ్ పథకంలో 90 శాతం రాయితీపై రైతులకు ఆయిల్ ఇంజన్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు, పరికరాలను ఐటీడీఏ పీవో అభిషేక్ కలిసి ఆమె పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి దొరకడం రైతులు చేసుకున్న అదృష్టమన్నారు. నాడు చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే నేడు తమ ప్రభుత్వం దానిని పండగ చేసిందన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ రూ.11 కోట్లు ఐదేళ్ల పాటు కొనసాగేందుకు వాటర్‌షెడ్ పథకం ఏర్పాటు అయిందన్నారు. ఇప్పటికే రూ.1.65కోట్లు ఖర్చయిందన్నారు. వర్షపునీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల పెంపు లక్ష్యమన్నారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా గిరిజనులకు ఐదు వేల ఎకరాల్లో సాగుకు అవసరమైన ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కొయ్యూరు మండలంలో వెయ్యి ఎకరాల్లో జీడిమామిడి సాగుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 600 ఎకరాల్లో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 90 శాతం రాయితీపై ఇస్తున్న పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ నూకరాజు మాట్లాడుతూ రైతులకు దుక్కిటెద్దులు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన పనులను వివరించారు. ఉపాధిహామీ ఏపీడీలు గిరి,రామారావు, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, వాటర్‌షెడ్ ఏపీవో శంకర్, ఎంపీటీసీలు బి.అప్పారావు, రత్నం, మల్లికార్జున, సర్పంచ్‌లు ఎం.బాలరాజు, ఇంగువ త్రినాథ్‌పడాల్, సత్యవేణి, ఏపీఎం శ్రీనివాస్, ఎంఈవో బోడంనాయుడు, ఏటీడబ్ల్యూవో క్రాంతి పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



సారా దాడుల్లో నిర్వహించిన ఎస్‌ఈబీ, పోలీసులు

పాడేరు రూరల్ : మండలంలోని డోకులూరు పంచాయతీ దుమ్మాపుట్టులో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది, పాడేరు పోలీసులు సంయుక్తంగా సారా దాడులు నిర్వహించారు. దుమ్మపుట్టు గ్రామంలో కొన్నాళ్లుగా సారా తయారీ, అమ్మకాలు సాగిస్తున్నారనే ఫిర్యాదుతో గురువారం ఉదయం ఎస్‌ఈబీ సిబ్బంది, పోలీసులు గ్రామానికి చేరుకున్నారు.

గ్రామ శివార్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన నాలుగు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేశారు.ఎస్‌ఈబీ సీఐ సంతోష్‌కుమార్, పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

గిరిజనుల్లో చైతన్యం నింపేందుకే జాగృతి

- చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్
- లక్కవరపేట నుంచి శ్రీకారం



లక్కవరపేటలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, సీఐ అశోక్‌కుమార్

గూడెంకొత్తవీధి: గిరిజనుల్లో చైతన్యం నింపేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాగృతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అన్నారు. మండలంలోని లక్కవరపేట పంచాయతీలో బుధవారం రాత్రి స్థానిక గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాంఘిక శక్తుల వల్ల కలిగే అనర్థాలు, చట్టవ్యతిరేక పనుల వల్ల జరిగే నష్టాలు, మూఢనమ్మకాలపై గిరిజనుల్లో చైతన్యం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజనుల్లో నేటికీ అనేక అపోహలున్నాయన్నారు. నిరక్షరాస్యత కారణంగా ఇవి మరింతగా పెరిగిపోతున్నాయన్నారు. వాటిని రూపుమాపి గిరిజనుల్లో అభద్రతా భావాన్ని తొలగించి వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు.గంజాయి, నాటుసారా, జూదం, రంగురాళ్ల తవ్వకాలు, ఆన్‌లైన్ మోసాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. గిరిజనులకు ఏమన్న వచ్చినా నిర్భయంగా తమ పోలీసులకు చెప్పవచ్చన్నారు. షార్ట్ ఫిల్ములు, వినోద భరిత కార్యక్రమాలను దృశ్య మాధ్యమం ద్వారా వారికి వివరించే ప్రయత్నం చేశారు. గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

చింతపల్లిలో ఆధార్ కేంద్రం సీజ్



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్, డీఎల్పీవో

చింతపల్లిరూరల్: మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సీజ్ చేశామని ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆధార్ సెంటర్ యజమాని ఆధార్ నమోదు, ఫోన్ అనుసంధానం తదితర విషయాల్లో గిరిజనుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణమే ఆధార్ కేంద్రాన్ని సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు తహసీల్దార్ లత్సాపాత్రుడు, డీఎల్పీవో కుమార్‌తో కలసి ఆధార్ కేంద్రం వద్ద విచారణ నిర్వహించి, సీజ్ చేశామని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రామారావు, ఏవో రవీంద్ర పాల్గొన్నారు.

మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం



మ్యూజియం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతపల్లి రూరల్: మ్యూజియం నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని తాజంగి,చింతపల్లిలో పర్యటించారు. తాజంగిలో మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతానికి సూచనలు చేశారు. మ్యూజియం నిర్మాణం పూర్తయితే లంబసింగి పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆయన తెలిపారు. అనంతరం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.మార్చురీ విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎంరాజు, ,డీఈఈ చాణుక్యరావు, సూపరింటెండెంట్ ఆదిత్య కీర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యాల మెరుగు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లి: విద్యార్థి దశలోనే వివిధ అంశాలపై వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు పాల్గొన్నారు.

భూ వివాదానికి రాజకీయ రంగు

- గ్రామ బహిష్కరణ అవాస్తవం
- గ్రామంలోనే ఉంటున్న మూడు కుటుంబాలు
- ఈనాడు ఉద్దేశ పూర్వకంగా ప్రచురించిందని విమర్శలు



వివాదానికి కారణమైన భూమి ఇదే

గూడెంకొత్తవీధి: మండలంలోని లక్కవరపుపేట గ్రామంలోని సర్పంచ్ కంకిపాటి వీరేంద్రప్రసాద్ అధికార పార్టీకి చెందిన వారు కావడంతో భూ వివాదానికి ఈనాడు దినపత్రిక ఉద్దేశపూర్వకంగా రాజకీయ రంగు పులిమిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో మూడు గిరిజన కుటుంబాలు గ్రామ బహిష్కరణ అంటూ అసత్య కథనం ప్రచురితమైంది. దీనిపై వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే గ్రామ బహిష్కరణకు గురయ్యాయంటున్న మూడు కుటుంబాలు గ్రామంలోనే ఉంటున్నాయి. సంక్షేమ పథకాలు కూడా ఆ కుటుంబాలు పొందుతున్నాయి. సర్పంచ్ కంకిపాటి వీరేంద్రప్రసాద్‌పై ఫిర్యాదు చేసిన కంకిపాటి శ్రీనివాసరావు, కంకిపాటి మల్లుపడాల్, కంకిపాటి గోపాల్ ఒకే కుటుంబానికి చెందిన వారు. ఉమ్మడి భూమిలో కొంత భాగం గ్రామ సచివాలయ భవన నిర్మాణ అవసరాలకు సర్పంచ్ వీరేంద్రప్రసాద్ అడిగారు. లింగన్నపడాల్ కొడుకులైన శ్రీనివాసరావు, మల్లుపడాల్, గోపాల్ ఇష్టపడలేదు. దీంతో సర్పంచ్‌కు వారికి మధ్య చిన్నపాటి భూ వివాదం నెలకొంది. సర్పంచ్ వీరేంద్రప్రసాద్ తమ మూడు కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసినట్టు రామారావు, మల్లుపడాల్, గోపాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆ పత్రిక కథనంలో పేర్కొంది. అయితే గురువారం లక్కవరపుపేట గ్రామానికి వెళ్లి విచారించగా గ్రామ బహిష్కరణ అవాస్తవమని స్థానికులు తెలిపారు. లింగన్నపడాల్ కొడుకులైన శ్రీనివాసరావు, మల్లుపడాల్, గోపాల్ మాట్లాడుతూ తాము గ్రామ బహిష్కరణ కోసం ఎవరికి చెప్పలేదన్నారు. అది ఏమాత్రం వాస్తవం కాదని వారే స్వయంగా చెప్పడం గమనార్హం.

అందరిలాగే పథకాలు..

శ్రీనివాసరావు, మల్లుపడాల్, గోపాల్ కుటుంబాలకు అందరి మాదిరిగానే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. కంకిపాటి మల్లుపడాల్‌కు ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, పింఛను కానుక కింద మూడేళ్లలో రూ.2,01,464 లబ్ధి చేకూరింది. కంకిపాటి గోపాలరావు వైఎస్సార్ ఫించను కానుక, చేయూత, జగనన్న విద్యాదీవెన, రైతు భరోసా కింద రూ.1,55,813 లబ్ధి పొందారులు. కంకిపాటి శ్రీనివాసరావు అనే వ్యక్తి సీలేరు ఏపీ గురుకుల కళాశాలలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు.ఈయనకు ప్రభుత్వం నుంచి రైతు భరోసా, అమ్మఒడి కింద ఆయన భార్య రమాదేవి రూ.39 వేలు ప్రభుత్వం నుంచి పొందారు.

తప్పుడు కథనం తగదు

ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ అందిస్తున్నాం. కొన్ని వివాదాలను కారణంగా చూపించి సంక్షేమ పథకాలు అందనీయడం లేదనడం సరికాదు. ప్రభుత్వానికి, తనకు చెడ్డపేరు వచ్చేలా తప్పుడు కథనాలు ప్రచురించడం ఈనాడు దినపత్రికకు తగదు.

-కంకిపాటి వీరేంద్రప్రసాద్, సర్పంచ్, లక్కవరపుపేట

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ): అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 2,4,6,8,10, 12,14,16,18,20,22,24, 26,28,30 తేదీల్లోను, కిరండూల్ -విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 3,5,7,9,11, 13,15,17, 19,21,23,25,27, 29,31 తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చని తెలిపారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

పాడేరు రూరల్ : జిల్లాలో నిరుద్యోగ యువతకు ఏపీ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి మంగళగిరి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్, ఎలక్ట్రికల్ సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ ఖాదీ మరియు పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డా.వి.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో రుణ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు:7396749236, 9059665146.

వైద్య ఆరోగ్య శాఖలో మరో 69 మంది బదిలీ

మహారాణిపేట (విశాఖ) : వైద్య ఆరోగ్య శాఖ జోన్ వన్ పరిధిలో గురువారం మల్టీ పర్పస్ హెల్త్ సర్వీస్(ఎంపీహెచ్ఎస్-మేల్), మల్టీ పర్పస్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో)లకు కౌన్సెలింగ్ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో డీడీ శ్రీనివాస్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాలోని ఉద్యోగులకు బదిలీలు చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశాల ప్రకారం ఏపీజీఈఏ ఆఫీస్ బేరర్లకు రిటెన్షన్(వారి స్థానంలోనే ఉండిపోవడం) అవకాశం ఇచ్చారు. ఎంపీహెచ్(మేల్) క్యాడర్‌లో 9 మంది, ఎంపీహెచ్ఈవో క్యాడర్‌లో 10 మంది రిటెన్షన్ పొందారు. మొత్తంగా గురువారం ఎంపీహెచ్(మేల్)లో 38 మంది, ఎంపీహెచ్ఈవోలో 31 మందికి బదిలీలు జరిగాయి.

సింహగిరీశునికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేష హారతులు అందజేశారు.

పర్యాటక ప్రాంతాలు మరింత అభివృద్ధి

- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి



రంపచోడవరంలో డీఎఫ్‌వో బంగ్లా నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలో అడవులను సంరక్షించడంతోపాటు పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఆయన మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో పర్యటించారు. మారేడుమిల్లిలో జలతరంగిణి అమృతధార, జంగిల్ స్టార్ పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. అనంతరం స్థానిక జీసీసీ కార్యాలయ ప్రాంగణంలో డీఎఫ్‌వో బంగ్లా నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. జీసీసీ డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావుతో మాట్లాడారు. డీఎఫ్‌వో నరేంద్రియన్, డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి, సబ్ డీఎఫ్‌వో భరణి, రేంజి అధికారులు పాల్గొన్నారు .

క్లుప్తంగా

టెక్ డ్రైవ్‌లో ఐదుగురి ఎంపిక

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ అధ్వర్యంలో గురువారం నిర్వహించిన హెచ్‌సీఎల్ టెక్ డ్రైవ్‌లో ఐదుగురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలంటే చాలా కష్టమని, చాలా నైపుణ్యాలు అవసరమన్నారు. హెచ్‌సీఎల్ కంపెనీ ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగం కల్పిస్తూ ఉన్నత చదువులకు అవకాశం కల్పించడం చాలా మంది విషయమన్నారు. డ్రైవ్‌లో ప్రతిభ కనిబరిచిన వారిని ఆయన అభినందిచారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట బస్‌స్టేషన్ నుంచి నాలుగు కేజీల గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర అరెస్టు చేశారు. గంటూరు జిల్లాకు చెందిన కుంచం చిన రాజప్ప (18), గూడి పవన్‌కుమార్ (20), వీరాంజనేయులు (35) అనే ముగ్గురు వ్యక్తులు బ్యాగ్‌తో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు తరలించామని చెప్పారు.

ఉరేసుకుని కలాసీ ఆత్మహత్య

నర్సీపట్నం: పట్టణంలో జిల్లా పరిషత్ హైస్కూల్ (తురకబడి) వెనుక ఖాళీ స్థలంలో చెట్టుకు ఉరేసుకుని జి.మల్లేశ్వరరావు(40) ఆత్మహత్య చేసుకున్నాడని టౌన్ ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కొత్తవీధికి చెందిన ఆయన కలాసీ పని చేస్తుంటాడు. కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ దారుణానికి ఒడిగట్టాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరిధాన్యాలు

- మన్యంలో పెరుగుతున్న చిరుధాన్యాల వినియోగం
- వారపు సంతల్లో విక్రయాలు



జి.మాడుగుల: మన్యంలో చిరుధాన్యాలు, దంపుడు బియ్యం, విరివిగా లభించే ఆకుకూరలు, కూరగాయలు వినియోగం పెరగటంతో ఏజెన్సీ ప్రాంత వారపు సంతల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తక్కువ కాల పరిమితిలో పండే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. జిల్లా ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజానీకంలో అనేక మంది దంపుడు బియ్యం, రాగులు, జొన్నలు, సామలు చిరుకందులు, రాజ్‌మా కందులు చిరుధాన్యాలు, అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే ఆకుకూరలు, దుంపలు వినియోగిస్తున్నారు. కొండపోడు, ఇతర వ్యవసాయ పనులకు బయలుదేరే ముందుగా అంబలి(రాగి మాల్టు), మహిళలు వంటచెరుకుకు వెళ్లేటప్పుడు మంచినీటికి బదులుగా అంబలి తీసుకుంటారు. దీంతో చిరుధాన్యాలకు డిమాండ్ ఉంది. ఎటువంటి రసాయనాలు లేకుండా మన్యంలో పండించే చిరుధాన్యాలకు గిరాకీ ఉండడంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

గ్రామాల్లో విరివిగా లభిస్తున్న పోషక విలువలు గల అహారం పట్ల దృష్టిసారిస్తున్నారు. దంపుడు బియ్యం, సామ బియ్యం, రాగులు, కందులు చిరుధాన్యాలు వినియోగం పెరగటంతో వీటి వ్యాపారం జోరుగా సాగుతుంది. దీంతో పాటు అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే కొంకేడికూర, పాలకూర,తోటకూర కంచేడుపూలు, గొడ్డుకూర తదితర ఆకు కూరలు, దుంపలు వంటివి గిరిజనులు సేకరించి ఇంటి అవసరాలకు కొంత ఉంచుకొని , మిగతా వాటిని ఏజెన్సీలో మండల కేంద్రాలు, వారపుసంతల్లో విక్రయిస్తున్నారు.

దంపుడు బియ్యం, సామ బియ్యం, కందులు, చిరుధాన్యాలు పంటలు,అటవీ ప్రాంతాల్లో సేకరించే ఆకుకూరలు, దుంపలు దుకాణాలు ఏర్పాటు చేసి సరసమైన ధరలకే గిరిజన వ్యాపారులు విక్రయిస్తున్నారు.ఆదివాసీ గిరిజనులే కాకుండా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సైతం వీటిని కొనుగోళు చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందటానికి దృష్టి సారస్తున్నారు.

వారపు సంతల్లో ధరలు

దంపుడు బియ్యం కిలో రూ.30, సామ బియ్యం కిలో రూ.30, కొర్రలు కిలో రూ.25 రాగులు కిలో రూ.25, రాజ్మా చిక్కుళ్లు (తెలుపు)కిలో రూ.90, రాజ్‌మా (ఎరుపు) కిలో రూ.75, కొంకేడికూర రూ.30, పాల కూర కట్ట రూ.20, గొడ్డుకూర కట్ట రూ.25లకు విక్రయిస్తున్నారు.

ఆశాజనకంగా ధరలు

వరితో పాటు, రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాల పంటలు పండిస్తున్నాం. అటవీ ప్రాంతాల్లో లభించే కొంకేడికూర, తోటకూర, కంచేడిపూలు, గోడ్డుకూర వంటి కూరలు సేకరిస్తాం. సేకరించిన వాటిలో కొంత భాగం అవసరాలకు ఉంచుకొని మిగిలిన సరకును సంతలకు తరలించి విక్రయిస్తున్నాం. వారపు సంతల్లో వీటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

-రాజుబాబు, రైతు, గడుతూరు, జి.మాడుగుల మండల

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి

- ఐటీడీఏ పీవో అభిషేక్



సరకులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

కొయ్యూరు: పోటీ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు సత్తా చాటాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు.ఇష్టపడి చదివితే అనుకున్న ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.వారు కూడా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో పీవో ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలించాలన్నారు. అంతకు ముందు ఆయన కొయ్యూరు బాలుర-2 పాఠశాల, మంపలో పాఠశాలలను సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. గుడ్లు, నూనె ప్యాకెట్లు ఇతర సరకులను తనిఖీ చేశారు. నాణ్యత లేని నాసి సరకులను తీసుకోవద్దని ఆదేశించారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కొయ్యూరులో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు పీవో అభిషేక్ విలేకరులకు తెలిపారు. దీన్ని మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. స్థానికంగా ఉన్న బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో బాలికలకు కేటాయిస్తున్న సీట్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హెచ్‌ఎం మురళీకృష్ణ, వార్డెన్ వేణు, ఏపీఆర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మంప హెచ్‌ఎం సత్తిబాబు, ఏటీడబ్ల్యూవో క్రాంతి ఉన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్



ఘాట్ రోడ్డులో అడ్డంగా నిలిచిపోయిన లారీ



నిలిచిన వాహనాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో గురువారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చత్తీస్‌గఢ్‌కు చెందిన లోడ్ లారీ రాజమహేంద్రవరంకు వెళ్తుండగా ఘాట్ రోడ్డులోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద ఇంజన్‌లో సాంకేతిక లోపం కారణంగా రహదారికి అడ్డంగా నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా భారీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సులు కూడా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 10 గంటల అనంతరం వాహనాదారులు శ్రమించి లారీని పక్కకు జరపడంతతో యధావిధిగా రాకపోకలు సాగాయి.

పోక్సో కేసులో గర్నికం యువకుడికి మూడేళ్ల జైలు

రావికమతం : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన గర్నికం గ్రామ యువకునికి విశాఖ పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష , రూ.20వేల అపరాధ రుసుమును గురువారం విధించింది. స్థానికంగా సంచలనం కలిగించిన ఈ కేసు వివరాలను రావికమతం ఎస్‌ఐ ఉమా మహేశ్వర రావు గురువారం తెలియజేశారు. ఆయన కథనం మేరకు 2018లో గర్నికం గ్రామానికి చెందిన ఒక బాలిక సైకిల్ తొక్కుకుంటూ ఆడుకుంటుండగా ఆ గ్రామానికి చెందిన కేశంశెట్టి చిరంజీవి(25) బాలిక వెనుక నుంచి గుట్టుగా వెళ్లి సమీపంలోని చెరకు తోటలోకి తీసుకువెళ్లి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు, కుటుంబీకులు వచ్చి బాలికను రక్షించి చిరంజీవిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి రావికమతం పోలీసులు కోర్టుకు సమర్పించారు. స్పెషల్ పీపీ కరణం కృష్ణ వాదనలు వింటూ సుదీర్ఘ విచారణ జరిపిన విశాఖపట్నం పోక్సో కోర్టు ఈ తీర్పునిచ్చిందని ఎస్‌ఐ తెలిపారు. ఇటువంటి సంచలనాత్మక తీర్పుల వల్ల బాలికలు, మహిళలకు మరింత భద్రత చేకూరనుందని ఈ సందర్భంగా తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మాడుగుల రూరల్: మండలంలో సత్యవరం గ్రామానికి చెందిన వాలేటి వెంకటరావు(28) అనుమానాస్పదంగా మృతి చెందాడు. వీరవల్లి అగ్రహారం సమీపంలో ఇటుకల బట్టీ వద్ద గురువారం ఉదయం ఉరేసుకుని మృతి చెందిన విషయం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. దీనిపై మృతుడు సోదరుడు మోహన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎం.బి.ఎ చదువుకున్న వెంకటరావు కొద్ది మాసాలుగా చింతపల్లి మండలం లంబసింగి సమీపంలో చిత్రాలగుట్టలో ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి వీరవల్లి అగ్రహారం మోదమాంబ ఆలయం సమీపంలో ఇటుకల బట్టీ ప్రాంతంలో ఉరేసుకుని చనిపోయాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామన్నారు.

కారు, మోటార్ సైకిల్ ఢీకొని ఒకరికి గాయాలు



ఘనటా స్థలంలో కారు, బైక్



క్షతగాత్రుడు కోటేశ్వర్రావుని 108లో తరలిస్తున్న దృశ్యం

అడ్డతీగల: అడ్డతీగల మండలం వీరభద్రపురం వద్ద గురువారం కారు, మోటార్ సైకిల్ పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అడ్డతీగల నుంచి చెరుకుంపాలెం వైపు వెళ్తున్న బైక్‌ని విశాఖపట్నం నుంచి అడ్డతీగల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న అడ్డతీగల మండలం ఉప్పలపాడుకి చెందిన భీమిరెడ్డి కోటేశ్వర్రావు బైక్‌పై నుంచి ఎగిరి కారు కిందికి వెళ్లి పడిపోయి తీవ్రంగా గాయపడడంతో అపస్మారక స్థితికి చేరాడు. బైక్ నడుపుతున్న కుమార్ అనే వ్యక్తి ఎగిరి కారు అద్దాలపై పడడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కాగా కారు కింద పడి తీవ్రంగా గాయపడిన కోటేశ్వర్రావుకు నడుం భాగంలో తీవ్ర గాయమై లేవలేని స్థితిలో ఉన్నాడు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు తగిన ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం తీవ్రంగా గాయపడిన కోటేశ్వర్రావును మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కి రిఫర్ చేశారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షంతో రైతుల హర్షం



పొలాల్లో చేరిన వర్షపు నీరు

రాజవొమ్మంగి: గత రెండు రోజులుగా రాజవొమ్మంగి పరిసరాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. తొలకరి వ్యవసాయ పనులకు ఎంతో మేలని రైతులు సంతోషపడుతున్నారు. భారీ వర్షాలకు మడికట్టు నేలల్లో నీరు చేరింది. బుధవారం రాత్రి కురిసిన వానకు కబర్మతి కొండ వాగు పొంగి ప్రవహించింది. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందించిన వరి విత్తనాలను రైతులకు అధికారులు పంపిణీ చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా మారడంతో రైతులు వరి నారు మడులు వేసుకొనే పనుల్లో నిమగ్నమయ్యారు.

రేపటి నుంచి ఆరుద్రకార్తె

మృగశిర కార్తె గురువారంతో ముగిసి పోగా శుక్రవారం ఆరుద్ర కార్తె ప్రారంభం కానుంది. ఆరుద్రలో విత్తులు నాటితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. ఇందుకు అనుగుణంగా వర్షాలు కూడా కురుస్తుండడంతో తొలకరి సాగుపై రైతాంగం కోటి ఆశలు పెట్టుకొంది. వ్యవసాయ పనులను ముమ్మరం చేసింది.

వరికి ముందు నవధాన్యాలు లాభదాయకం



రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న సిబ్బంది

రావికమతం: వరి సాగుకు ముందు భూమిలో నవధాన్యాలు వేయడం వల్ల ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా అందుతాయని, తెగుళ్లు లేని ఆరోగ్య దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ అధికారి ప్రకాష్ తెలిపారు. దొండపూడి రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు 30 రకాల అపరాల విత్తన కిట్లును ఆయన గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై వీటిని అందిస్తుందన్నారు. ప్రతి రైతు వరికి ముందు సాగు చేస్తే, ప్రధాన పంటలో లాభాలేగాక వీటి ఫలాలు పొందవచ్చన్నారు. పశువులకు మేతగానూ ఉపయోగించుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగుల మందుల బాధలు ఉండవన్నారు. అనంతరం గ్రామంలో ఇప్పటికే రైతులు సాగు చేసిన భూములను పరిశీలించి అభినందించారు. ఉప సర్పంచ్ గర్రెడ్డి రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రామలక్ష్మి, జగదీష్, గుణవతి, నిర్మల పాల్గొన్నారు.

జాగ్రత్తగా వెళ్లండి.. హ్యాపీ జర్నీ

- ప్రమాదాల కట్టడికి పోలీసుశాఖ విస్తృత ప్రచారం



పోలీసు శాఖ విడుదల చేసిన కరపత్రం

జి.మాడుగుల: డ్రైవింగ్ చేసే ప్రతీ ఒక్కరు ఒవర్‌టేక్ చేసే సమయంలో తొందరపడి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని, వాహనాలు నడుపుతున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్‌శాఖ సోషల్ మీడియా, వాట్సప్‌ల్లో విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నిలువరించేందుకు కరపత్రాన్ని పోలీస్ శాఖ విడుదల చేసింది. వాహనచోదకులు ఓవర్‌టేక్ చేసి ప్రమాదాల బారిన పడొద్దని తెలిపారు. ప్రమాదం జరిగితే ఆస్పత్రిలో గంటలు, రోజులు, వారాలు, నెలలు అవసరమైతే సంవత్సరాలు కూడా కోలుకోలేని పరిస్థితి ఉంటుందని కరపత్రంలో పేర్కొన్నారు. ముందు వెళ్లేవాడు వెళ్లనీ.. వెనకాల నెమ్మదిగా హాయిగా వెళ్లు..ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ.. హెల్మెట్ ధరించి...వాహనాలు నియంత్రణలో ఉంచుకొని నడపండి, సురక్షితంగా మీ గమ్యాన్ని చేరుకోండని పోలీస్‌శాఖ కరపత్రంలో సూచించింది. మీ కోసం.. మీ కుటుంబ సభ్యులు, పిల్లలు ఇంటి వద్ద ఎదురు చూస్తుంటారని మరవకండని పోలీస్‌శాఖ విస్తృత ప్రచారం చేపట్టింది.

24న యువ ఉత్సవ్ ఇండియా పోటీలు

అనకాపల్లి టౌన్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 24న గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్ ఇండియా ఏ2047' నిర్వహిస్తున్నట్లు ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. గురువారం తన కార్యాలయంలో యువ ఉత్సవ్ ఇండియా ఏ2047 గోడపత్రికలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువశక్తి పెంపుదలలో భాగంగా యువ ఉత్సవ్-2023 పేరున జిల్లా స్థాయిలో వక్తృత్వ, యువ కళాకారులు, యువ రచయితలు, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయక వారసత్వ ప్రదర్శనల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యం, బానిసత్వం వలసవాద మనస్తత్వాలను తొలగించడం, వారసత్వం, ఐక్యత, సంఘీభావం, పౌరులలో కర్తవ్య భావం, (పంచ ప్రాణాలు ఐదు సంకల్పాలు) ప్రధాన అంశాలుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యువ ఉత్సవ్ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, పేర్కొన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ఆగస్టు నుంచి సెప్టెంబర్ 2023 వరకు రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు అక్టోబర్ 3, 4 తేదీల్లో ఢిల్లీలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 8074605109 సంప్రదించాలని కోరా రు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీ త కాంద్రేగుల సత్యానారాయణ పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలు

అనకాపల్లి టౌన్: గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఏసీ కల్యాణ మండపంలో జూలై 14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు డి.వి.ఆర్ కార్యాలయంలో పోటీల కరపత్రాలను గురువారం ఆయన విడుదల చేశారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ పోటీలను నిజిసోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

నర్సీపట్నం: గంజాయి తీసుకువెళ్తున్న విజయవాడకు చెందిన నలుగురు యువకులు, ఒక యువతిని టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టౌన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు... చింతపల్లి రూట్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా నలుగురు యువకులు, యువతి అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద బ్యాగ్‌లను తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన 19 ఏళ్ల సల్మాన్, జి.రాజు, మణికంఠ, బి.దుర్గాప్రసాద్‌తోపాటు సాయి కుమారి అనే యువతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతపల్లి పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి విజయవాడ తీసుకువెళ్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రూ.152 కోట్లతో ఏఎంసీలో వసతులు

- తొలి విడతగా రూ.25 కోట్లు విడుదల
- ఇందులో రాష్ట్ర వాటా 40 శాతం
- చురుగ్గా సాగుతున్న వసతి గృహ పనులు



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మహారాణిపేట: వందేళ్ల చరిత్ర గల ఆంధ్రా వైద్య కళాశాల(ఏఎంసీ)లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.152 కోట్లతో సదుపాయాలు, వసతి గృహాల నిర్మాణం, కీలక వైద్య పరికరాల సమీకరణ, తదితర అభివృద్ధి పనుల కోసం రూపొందించిన డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.25 కోట్లు విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం. ఈ నిధులతో ప్రారంభించిన పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందిన వారికి పీజీ సీట్లు కేటాయించడంతో.. ఆంధ్రా వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెరిగాయి. మొత్తంగా 27 వైద్య విభాగాలకు 131 సీట్లు కేటాయించగా.. ఈ ఏడాది 101 సీట్లను కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. పీజీ సీట్లు పెరగడంతో కళాశాలలో మౌలిక సదుపాయాలు, వసతి గృహాల నిర్మాణం, కీలక వైద్య పరికరాల కోసం రూ.152 కోట్లతో రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ, ఆంధ్ర వైద్య కళాశాల సంయుక్తంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపొందించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జాతీయ వైద్య మండలి, కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ డీపీఆర్‌ను సమర్పించారు. ఈ డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల విడుదలకు మార్గం సుగుమం అయింది. ఇందులో భాగంగా తొలి విడతలో రూ.25 కోట్లు విడుదలయ్యాయి.

ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రస్తుతం 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన 131 సీట్లు కలిపితే ఆ సంఖ్య 368కి చేరుతుంది. ఈ నేపథ్యంలో రూ.23.38 కోట్లతో పీజీ వుమెన్ హాస్టల్, రూ.35.50 కోట్లతో మెన్ వసతి గృహం, రూ.12.50 కోట్లతో సీఎ స్పార్ బ్లాక్(అదనపు అంతస్తు), రూ.4 కోట్లతో ఎస్ఎస్ బ్లాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు. తొలి విడతలో విడుదలైన నిధులతో తొమ్మిది అంతస్తులతో మెన్ హాస్టల్, ఏడు అంతస్తులతో వుమెన్ హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం



కొత్తగా సమకూరే భవనాల్లో సమావేశ మందిరాలు, లెక్చర్ హాళ్లు ఏర్పాటు చేస్తాం . ఆపరేషన్ థియేటర్లలో వసతులు మెరుగుపరుస్తాం. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) మార్గ దర్శకాలను అనుసరించి వసతులు కల్పిస్తున్నాం. పందిమెట్ట ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణం ప్రారంభించాం. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– డాక్టర్ జి.బుచ్చిరాజు, ప్రిన్సిపాల్, ఏఎంసీ